క్లుప్తంగా

ఆలయాల్లో ప్రత్యేక పూజలు


పూజలందుకుంటున్న వెంకటేశ్వరస్వామి

కౌతాళం: మండలంలోని పలు ఆలయాలు శనివారం భక్తులతో పోటెత్తాయి. మండల కేంద్రమైన కౌతాళంతో పాటు అగసలదిన్నె గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి, సుళేకేరిలోని బుడుములదొడ్డి ఆంజనేయ స్వామి, ఎరిగేరిలోని పులిగట్టు ఆంజనేయ స్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కౌతాళంలో వెలసిన వెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు అధికంగా తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. తెల్లవారుజామున అర్చకులు స్వామివార్లకు సుప్రభాతసేవ, మహా మంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలు చేపట్టారు.

ఘనంగా గ్యార తారిఖ్ వేడుకలు


స్వామి వారి సమాధికి పూలు సమర్పిస్తున్న ధర్మకర్త, పీఠాధిపతి

కౌతాళం: మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో శనివారం గ్యారతారిఖ్ వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాష చిష్తీలు స్వామి సమాధికి గంధంతో పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు. చాలా మంది భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు. వచ్చిన భక్తులందరికి ధర్మకర్త అన్నదానం ఏర్పాటు చేశారు.

ఎంపీపీ నిధులతో సమస్య పరిష్కారం


ఆసుపత్రి ఆవరణను పరిశీలిస్తున్న సర్పంచ్

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళం పశువుల ఆసుపత్రి ఆవరణలో నెలకొన్న సమస్యను ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆదేశాలతో ఎంపీపీ నిధులతో పరిష్కరించినట్లు సర్పంచ్ పాల్ దినకర్ తెలిపారు. ఆసుపత్రి ఆవరణలో మురికి నీరు నిలిచి కంపు కొడుతుండటంతో శనివారం జేసీబీతో ముళ్ల పొదలు పూర్తిగా తొలగించి, నీళ్లను ట్రాక్టర్ ద్వారా బయటకు పంపింగ్ చేశామన్నారు. ఆవరణం అంతా ఆరిన తర్వాత గ్రావెల్‌ను వేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ బుజ్జిస్వామి, మండల కన్వీనర్ ప్రహ్లాద ఆచారి తెలిపారు.

బకాయిలను విడుదల చేయాలి


మాట్లాడుతున్న ఎస్టీయూ నాయకులు బి. రమేష్ నాయుడు

ఆదోని సెంట్రల్: పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయుల సంపాదిత సెలవుల బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్టీయూ సీనియర్ నాయకులు బి.రమేష్ నాయుడు డిమాండ్ చేశారు. ఎస్టీయూ భవనంలో జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ పి. నాగేంద్రప్ప అధ్యక్షతన శనివారం సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర అవుతున్నా సంపాదిత సెలవుల బకాయిలు విడుదల చేయకపోవడం మోసం చేయడమేనన్నారు. సమావేశంలో ఎస్టీయూ నాయకులు ఎం. శ్రీనివాసులు, జ్యోతిమూర్తి, నాగప్రసాద్, వి. శ్రీనివాసులు, కాశి విశ్వనాథ్ శాస్త్రి, అనుమన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు గొరవయ్యల ఆటలు

హొళగుంద: బన్ని ఉత్సవాల్లో భాగంగా దేవరగట్టులో ఆదివారం గొరవయ్యల ఆటలు, గొలుసు తెంపుట, దేవదాసిల క్రీడోత్సవాలు జరగనున్నాయి. ఉత్సవంలో రెండో ప్రధాన ఘట్టమైన గొరవయ్యల ఆటలను చూడడానికి రాష్ట్రం నలుమూలాల నుంచే కాకా తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గొరవయ్యలు, గురు గొరవయ్యలు, పిల్ల గొరవయ్యల నృత్యాలు, బళ్లారుకు చెందిన గొరవయ్య గొలుసు తెంపడం భక్తులను ఆకట్టుకుంటుంది. సాయంత్రం దేవదాసిల క్రీడోత్సవాలు, వసంతోత్సవం జరగనున్నాయి. అనంతరం మాళ మల్లేశ్వరస్వామి విగ్రహాలు, పల్లకీ కంకణ విసర్జనలో భాగంగా గిరి పైనున్న ఆలయానికి చేరుతాయి. అక్కడి నుంచి సోమవారం నెరణికి గ్రామానికి చేరడంతో ఉత్సవాలు ముగుస్తాయి.


కారిడార్‌లో ఇరువైపులా వాహనాల పార్కింగ్


నిలిచిపోయిన వాహనాలతో రాఘవేంద్ర సర్కిల్‌లో స్తంభించిన ట్రాఫిక్

రాఘవా.. దారేదీ!

మహిమాన్వితుడు శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శనానికి సుదూర ప్రాంతాల నుంచి మంత్రాలయం చేరుకునే భక్తులు శ్రీమఠానికి వెళ్లాలంటే మాత్రం ఎంతో ఓపిక ఉండాల్సిందే. ఓ వైపు శ్రీమఠం అధికారులు, పోలీసుల నిర్లక్ష్యంతో భక్తులకు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. దసరా సెలవులు కలిసి రావడంతో శనివారం లక్షల్లో భక్తులు రాగా వాహనాల తాకిడి విపరీతంగా పెరిగిపోయింది. సరైనా పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో వాహనాలను రోడ్లపైనే నిలిపివేస్తున్నారు. ట్రాఫిక్ నియంత్రణలోనూ శ్రీమఠం, పోలీస్ యంత్రాంగం మీనమేషాలు లెక్కిడుతోంది. దీంతో మంత్రాలయంలో ట్రాఫిక్ సమస్య జఠిలంగా ఉండటంతో భక్తులు తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

–మంత్రాలయం రూరల్

కమనీయం.. నిమజ్జనోత్సవం


నిమజ్జనోత్సవానికి అమ్మవార్ల విగ్రహాలను ఊరేగింపుగా తరలిస్తున్న దృశ్యం

ఆదోని అర్బన్: దసరా నవరాత్రోత్సవాల్లో భాగంగా కొలువుదీరి తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజలందుకున్న దుర్గామాత విగ్రహాలను శనివారం నిమజ్జనం చేశారు. పట్టణంలోని ఆయా వీధుల్లో మండప నిర్వాహకుల ఆధ్వర్యంలో కొలువుదీరిన అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపుగా తీసుకెళ్లి చిన్నహరివాణం వద్ద ఉన్న ఎల్లెల్సీలో నిమజ్జనం చేశారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం


అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్ వైజర్ కాత్యాయని

కోసిగి : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా పొందవచ్చునని స్త్రీ శిశు సంక్షేమ శాఖ సూపర్ వైజర్ కాత్యాయిని సూచించారు. శనివారం కోసిగిలో 9వ, 10వ అంగన్ వాడీ కేంద్రంలో అంగన్ వాడీ కార్యకర్తలతో కలిసి 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవం నిర్వహించారు. ముందుగా ఆ కాలనీలో ర్యాలీ చేపట్టి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి రోజులు పోషకాలతో కూడిన ఆహారం తీసుకుంటే మంచి ఆరోగ్యంతో పాటు పుట్టబోయే బిడ్డ ఆరోగ్యవంతంగా ఉంటాడని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు శైలజ, జ్యోతి, లూసమ్మ, వరలక్ష్మీ, భీమలింగమ్మ, దేవి, వెంకటమ్మ, నాగలక్ష్మి, నాగవేణి, లత, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేను పకడ్బందీగా చేపట్టండి


సోమలగూడూరులో రీ సర్వేను ప్రారంభిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

నందవరం: గ్రామాల్లో గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలు రీ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. శనివారం మండల పరిధిలోని సోమలగూడూరు గ్రామంలో భూమి పూజ చేసి తహసీల్దార్ రీ సర్వే ప్రక్రియను ప్రారంభించారు. అనంతరం గ్రామంలో రైతులతో రీ సర్వేపై గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో మొత్తం సర్వే నెంబర్లు 461 ఉన్నాయని, అందులో భూ విస్తీర్ణం 4584.28 ఎకరాలు ఉందన్నాయని చెప్పారు. అందులో పట్టా భూమి 3409.93 ఎకరాలు, దేవదాయ శాఖ భూములు 62.22 ఎకరాలు, ప్రభుత్వ భూమి 321.27 ఎకరాలు ఉందని గుర్తించామన్నారు. రైతులు అందుబాటులో ఉండి తమ భూములను సర్వే చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌డీటీ మహేష్, మండల సర్వేయర్ అక్బర్‌బాషా, గ్రామ పెద్దలు వెంకటరామిరెడ్డి, గోపాల్ రెడ్డి, శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి


తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు


ఆదోని రూరల్: ఆదోని పట్టణంలో గత పది రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు ఇళ్లల్లోకి నీరు చేరి నష్టపోయిన పేద కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఆర్ఐ లక్ష్మయ్యకు అందించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, నాయకులు గోపాల్, తిప్పన్న, వెంకటేశులు, వీరేష్, నాగరాజు, శ్రీనివాసులు బాధిత కుటుంబాల ప్రజలతో కలిసి మాట్లాడారు. భారీ వర్షాలకు స్థానిక డీఎస్పీ బంగ్లా రోడ్డులో ఉన్న పేదల ఇళ్లల్లోకి నీరు చేరి తిండి గింజలు, బట్టలు, నిత్యావసర సరుకులు తడిచిపోయాయన్నారు. ఈ బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో బాధిత కుటుంబాల మహిళలు లక్ష్మి, రంగమ్మ, తిమ్మక్క, సరోజమ్మ, మంగమ్మ, బేగం తదితరులు పాల్గొన్నారు.

కరువు మండలంగా ప్రకటించాలి


డిప్యూటీ తహసీల్దార్ వీరభద్ర గౌడ్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతుకూలీ సంఘ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: ఈ ఏడాది అతివృష్టితో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు కరువు మండలాలుగా ప్రకటించాలని అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి సత్యన్న, నాయకుడు బాబులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ వీరభద్రగౌడ్‌కు వినతి పత్రం ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఈ ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన వేరుశనగ, ఉల్లి, పత్తి, మిరప, టమాట, కొర్ర, సజ్జ, పొద్దుతిరుగుడు, మొక్కజొన్న తదితర పంటలన్నీ భారీ వర్షాలకు దెబ్బతిన్నాయన్నారు. నందవరం, గోనెగండ్ల మండలాలను కరువు మండలంగా తక్షణం ప్రభుత్వం ప్రకటించాలని కోరారు. ఆయా పంటలకు ఎకరాకు రూ.40 వేల పరిహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు బాలముని, గౌస్, చంద్ర, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం చెల్లించాలి


దెబ్బతిన్న పత్తి పంటను పరిశీలిస్తున్న దృశ్యం

ఆదోని రూరల్: మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో అధిక వర్షాల వల్ల దెబ్బతిన్న పత్తి పంటను రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కె.వెంకటేశులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్నలు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను వ్యవసాయ అధికారులు పరిశీలించి నష్టపరిహార నివేదికలను తయారు చేయాలన్నారు. నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ.40 వేల చొప్పున నష్ట పరిహారం ఇవ్వాలన్నారు. పంట నష్టపరిహారం విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 6వ తేదీన తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల నాయకులు అయ్యన్న, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నాగప్ప, రైతులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: అధిక వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలని సీపీఎం కార్యవర్గ సభ్యుడు పీఎస్ రాధాకృష్ణ, జిల్లా కమిటీ సభ్యుడు నరసింహ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని పెద్దమర్రివీడు గ్రామంలో వర్షాలకు దెబ్బతిన్న పత్తి పంటలను వారు పరిశీలించారు. వారి వెంట సీపీఎం నాయకులు దండు ఖాజా, కరుణాకర్, నబీ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

కౌతాళం: అధిక వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతూ రైతు సంఘం, కేవీపీఎస్‌ల ఆధ్వర్యంలో కౌతాళంలోని వ్యవసాయ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు మల్లయ్య, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు చిన్న మారయ్య మాట్లాడుతూ వానలకు పూర్తిగా పంటలు దెబ్బతిన్న రైతులకు ఎకరాకు 50వేల వరకు పరిహారం అందించి ఆదుకోవాలన్నారు.

నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

ఆదోని టౌన్: అన్న క్యాంటీన్ ద్వారా నాణ్యమైన ఆహారాన్ని అందించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ నిర్వాహకులను ఆదేశించారు. శనివారం పట్టణంలోని అన్న క్యాంటీన్లను ఆయన తనిఖీ చేశారు. వండిన భోజనాన్ని తిని రుచి చూశారు. భోజనం చేస్తున్న వారి నుంచి భోజనం రుచిపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భోజనం నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని అన్నా క్యాంటీన్లలో సిబ్బంది పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సూచించారు. శనివారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లోని అన్నక్యాంటిన్‌ను ఆయన పరిశీలించారు. శుభ్రత పాటించి ప్రజలకు భోజనం, అల్పాహారం పంపిణీ చేయాలని ఆదేశించారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

కోసిగి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు చింతకుంట సామేల్, తాలుకా కో కన్వీనర్ కొట్టాల జయన్నలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం వారు కోసిగిలో మాట్లాడుతూ.. చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు నియోజకవర్గం వెదురుకుప్పం మండలం దేవళం పేట ప్రధాన కూడలిలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన మతోన్మాదులను అదుపులో తీసుకుని చట్టపరమైన తీసుకోవాలన్నారు. కాలిన విగ్రహ స్థానంలో కాంస్య విగ్రహానికి ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు నరసయ్య, నరసింహులు, జేమ్స్, శాంతిరాజు, హనుమంతు పాల్గొన్నారు.

గోనెగండ్ల: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన దుండగులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కరుణాకర్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ ఘటన ప్రజాస్వామ్య విలువలను అవమానపరిచే చర్య అన్నారు. అంబేద్కర్ విగ్రహాలపై దాడులు చేస్తూ సమాజాన్ని రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్న వారిపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజా సంఘాలతో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా ఐక్య ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

రోడ్డు బాగుపడేదెన్నడు!


మాధవరం రోడ్డులో వర్షపునీటి గుంతలో బోల్తా పడిన ఆటో, ఇరుక్కుపోయిన వాహనం

ఆదోని అర్బన్: చిన్న వర్షం వచ్చిందంటే చా లు... మాధవరం రోడ్డు మరింత అధ్వానంగా మారుతోంది. మార్గమధ్యలో ఓ చోట పెద్ద వంకలా మారి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఈ రహదారిలో ప్రతిరోజూ వాహనాలు బోల్తా పడడమేగాకుండా కొన్ని వాహనాలు ఇరుక్కుపోతున్నా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. శనివారం రైతులు అమ్మకానికి తెస్తున్న పత్తి దిగుబడుల ఆటో బోల్తా పడింది. అంతేగాకుండా మెటడోర్ వాహనం ఇరుక్కుపోయింది. దీంతో రైతులు బోల్తా పడిన వాహనాన్ని లేపేందుకు తీవ్రంగా శ్రమించారు. ఈ రోడ్డుకు మరమ్మతులు చేయాలని రైతులు, స్థానికులు, ప్రజలు కోరుతున్నారు.

మార్కెట్‌యార్డు పాలకవర్గ ప్రమాణ స్వీకారం

ఆదోని అర్బన్: ఆదోని మార్కెట్‌యార్డు పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం శనివారం జరిగింది. ఆదోని ఎమ్మెల్యే పార్థసారధి, టీడీపీ ఇన్‌చార్జి మీనాక్షినాయుడు, జనసేన పార్టీ ఇన్‌చార్జి మల్లప్ప ఆధ్వర్యంలో యార్డు చైర్‌పర్సన్‌గా శారద, వైస్ చైర్మన్‌గా ఆదూరి విజయ్‌కృష్ణతో పాటు డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. యార్డు సెక్రటరీ గోవిందు యార్డు చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో రైతులు, వ్యాపారస్తులు, కాటన్, ఏజెంట్, గ్రాం డ్‌సర్ట్స్ అసోసియేషన్ నాయకులు, ప్రముఖులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే హడావుడి : ఆదోని వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం హడావుడిగా జరిగింది. మార్కెట్ కమిటీ గౌరవాధ్యక్షులుగా ఉన్న ఆదోని బీజేపీ ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి రాక మునుపే మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు అంతా తానై హడావుడి చేశారు. ముహూర్తం దాటి పోతుందంటూ ప్రమాణ స్వీకారం చేయించడంతో అందరూ అవాక్కయ్యారు. కొంత సేపటికి అక్కడికి చేరుకున్న ఎమ్మెల్యే విషయం తెలుసుకుని కొంత అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అనంతరం ఆయన మాట్లాడుతూ సెస్ రూపంలో ఆదోని యార్డు నుంచి వచ్చిన ఆదాయాన్ని ఎక్కడో ఖర్చు పెట్టడం కరెక్ట్ కాదని, యార్డు చుట్టుపక్కల రోడ్లు వేసుకోవాలన్నారు. ఆదోనిని జిల్లాను చేస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు.

చలో విజయవాడకు తరలిరండి


చలో విజయవాడ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్, ఎస్టీయూ నాయకులు

ఆదోని సెంట్రల్: ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 7వ తేదీన చేపట్టే 'చలో విజయవాడ' కార్యక్రమానికి తరలిరావాలని మదిరె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రంగప్ప, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గాదిలింగప్ప, ఎస్టీయూ మండల ప్రధాన కార్యదర్శి సుధాకర్ పిలుపునిచ్చారు. శనివారం భోజన విరామమం సమయంలో కార్యక్రమం పోస్టర్లను విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం హామీలను విస్మరించడం తగదన్నారు. చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫ్యాప్టో జిల్లా కార్యదర్శి భాస్కర్, నాయకులు నాగరాజు, రమేష్ నాయుడు, చంద్రశేఖర్, వీరచంద్రయాదవ్, గాదిలింగప్ప, నరసయ్య, నాగేంద్ర, లక్ష్మయ్య, రామస్వామి పిలుపునిచ్చారు.

గోనెగండ్ల: 12వ పీఆర్సీ కమిటీని నియమించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో చేపట్టే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీటీఎఫ్ జిల్లా కార్యదర్శి కేవీ గంగాధర్ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని పెద్దమరివీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఆ పాఠశాల హెచ్‌ఎం సునీత దేవి, రామలింగం, నరసప్ప, జయలత, పురుషోత్తం పాల్గొన్నారు.

నందవరం: ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావలసిన ఆర్థిక బకాయిలు, ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడానికి ఈ నెల 7న చేపట్టే చలో విజయవాడ ధర్నాను విజయవంతం చేద్దామని ఫ్యాప్టో నాయకులు జె. ఎల్లప్ప (యూటీఎఫ్), జి. బసవరాజు (ఎస్‌టీయూ) పిలుపు నిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని స్థానిక జెడ్పీ పాఠశాల ఆవరణలో ఫ్యాప్టో ఆధ్వర్యంలో అక్టోబర్ 7న విజయవాడలో జరిగే ధర్నా కార్యక్రమం జయప్రదం చేయాలని హెచ్‌ఎం రామకృష్ణమరాజు, ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు కరపత్రాలను విడుదల చేశారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

ఆలూరు: దేవరగట్టు మాళమల్లేశ్వరస్వామి బన్నీ ఉత్సవంలో మృతి చెందిన కుటుంబాలను ఆదుకోవాలని సీపీఎం నియోజకవర్గ ప్రాంతీయ కమిటీ కార్యదర్శి పి.హనుమంతు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పోలీసులు, వివిధ శాఖల అధికారులు ఉత్సవాలపై అవగాహన కల్పించినా ప్రయోజనం లేకపోయిందన్నారు. డీవైఎఫ్ఐ నాయకుడు షాకీర్, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు కృష్ణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహబుబ్ సుభాని ఉరుసు


కుంటనహాల్‌లో గంధాన్ని తీసుకుని వస్తున్న దృశ్యం


ఫాతెహలు చేస్తున్న దృశ్యం

కౌతాళం: మండలంలో మహబుబ్ సుభాని ఉరుసును శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండల కేంద్రమైన కౌతాళంతో పాటు కుంటనహాల్, చిరుతపల్లి, హాల్వి, నదిచాగి, రౌడూరు వివిధ గ్రామాల్లో ఈ ఉరుసును నిర్వహించారు. జెండాలను ఇళ్ల నుంచి ఊరేగింపుగా తీసుకోని వచ్చి దర్గాల్లో ప్రత్యేక ఫాతెహలు చేసి దర్గాలో ప్రతిష్ఠించారు. దర్గాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. సాయంత్రం విద్యార్థులు, యువకులు ఆలపించిన సలాం పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు మహబుబ్ సుభాని మార్గంలో నడవాలని కోరారు.

క్షయవ్యాధిని తరిమేద్దాం


ర్యాలీ నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఆదోని టౌన్: క్షయవ్యాధిని దేశం నుంచి తరిమేద్దామని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షేకున్‌భాను, జిల్లా కోర్డినేటర్ ఉమాపతి అన్నారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని శంకర్‌నగర్ హెల్త్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. వార్డులో ర్యాలీ నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉన్నవారు, గళ్లలో తెమడ, రక్తం పడడం, ఛాతిలో నొప్పి, ఆయాసం, శ్వాస ఆడకపోవడం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, శరీరంలో ఇతర భాగాల్లో వాపు, కణుతలు ఉన్న వారు పై లక్షణాల్లో ఏ ఒక్కటీ ఉన్నా ప్రభుత్వ ఆసుపత్రిలో గళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది బాబురాజు, వీరేష్, ఏఎన్‌ఎం ఈరమ్మ, ఆశావర్కర్లు కె.శాంతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.